సాక్షి విశాఖపట్నం


గురువారం । 4 । సెప్టెంబర్ । 2025



ఉత్కంఠ పోరులో హర్యానా గెలుపు 8లో



సింహగిరిపై రెండో రోజు పవిత్రోత్సవాలు 8లో



వినాయక నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా సంపత్ వినాయగర్ స్వామి బుధవారం యోగ గణపతి అలంకరణలో దర్శనమిచ్చారు.

న్యూస్‌రీల్

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి స్వాగతం



జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి

విశాఖ లీగల్ : రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్‌కు విశాఖ విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. 5వ తేదీన నోవోటెల్, ర్యాడిసన్ బ్లూ హోటళ్లలో జరగనున్న వివిధ కార్యక్రమాల్లో ఆయన పాల్గొనున్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు, దామోదరం సంజీవయ్య లా యూనివర్సిటీ వీసీ డి.సూర్యప్రకాష్ రావు, కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్, పలువురు కోర్టు అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

నేడు సుప్రీంకోర్టు న్యాయమూర్తి రాక

మహారాణిపేట: సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ గురువారం విశాఖ వస్తున్నారు. ఢిల్లీ నుంచి ఎయిర్ ఇండియా విమానంలో సాయంత్రం 5.20 గంటలకు విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి నగరంలోని ప్రభుత్వ అతిథి గృహానికి చేరుకొని రాత్రి బస చేస్తారు. 5వ తేదీన రాడిసన్ బ్లూ హోటల్‌లో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం నొవోటెల్ హోటల్‌లో జరిగే దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో పాల్గొంటారు. 6వ తేదీన విమానంలో ఢిల్లీ వెళ్తారు.

హైకోర్టు న్యాయమూర్తుల రాక

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్.రఘునందనరావు, జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప్, జస్టిస్ చీమలపాటి రవి గురువారం విశాఖ వస్తున్నారు. నగరంలో శుక్రవారం జరగనున్న పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు.

ఎన్‌ఐపీఎం జాతీయ ఉపాధ్యక్షుడిగా మురళీధరరావు




మహారాణిపేట: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పర్సనల్ మేనేజ్‌మెంట్ (ఎన్ఐపీఎం) జాతీయ ఉపాధ్యక్షుడిగా విశాఖకు చెందిన డాక్టర్ బి.మురళీధరరావు ఎన్నికయ్యారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో నాగ్‌పూర్‌కు చెందిన రజిత్ పాండేపై 450 ఓట్ల మెజారిటీతో మురళీధరరావు విజయం సాధించారు. రెండేళ్ల పాటు ఆయన ఈ పదవిలో ఉంటారు. మురళీధరరావు గతంలో విశాఖ చాప్టర్ కార్యదర్శిగా, చైర్మన్‌గా, ఎన్ఐపీఎం ప్రాంతీయ వైస్ ప్రెసిడెంట్‌గా పనిచేశారు. ఆయన ప్రస్తుతం జపాన్ ఎంఎన్‌సీ మెస్సర్స్ టయోట్సు రేర్ ఎర్త్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, విశాఖపట్నంలో అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్–హెచ్ఆర్‌గా పనిచేస్తున్నారు.

నేడు స్థాయీ సంఘ సమావేశం



అల్లిపురం: జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం గురువారం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ సమావేశంలో 198 అంశాలను చర్చించనున్నారు. వీటిలో నీటి సరఫరా, కాలువలు, కల్వర్టుల నిర్మాణాలు, గ్రీన్ బెల్ట్ ప్రాంతాల అభివృద్ధి, బీటీ రోడ్డు నిర్మాణాలు, సీసీ రోడ్ల నిర్మాణాలు, భూగర్భ మురుగునీటి పారుదల పనులు, ప్రజారోగ్యం, గెడ్డల ఆధునికీకరణ, పరిపాలనా పరమైన విధానాలు తదితర అంశాలపై సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. నూతన స్థాయీ సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న తొలి సమావేశం ఇది.

ఏజీపీగా సతీష్



విశాఖ లీగల్ : నగరంలోని ఆరో అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు అదనపు ప్రభుత్వ న్యాయవాదిగా ఎల్.సతీష్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ న్యాయ వ్యవహారాల శాఖ కార్యదర్శి జి.ప్రతిభాదేవి ఉత్తర్వులు జారీ చేశారు. సతీష్ మూడేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగుతారు. ఆయన 1997లో ఎస్వీపీ లా కళాశాల నుంచి న్యాయ పట్టా పొంది న్యాయవాదిగా ప్రాక్టీస్ ప్రారంభించారు. ప్రభుత్వ, ఇతర కేసుల్లో ప్రైవేటు కంపెనీలకు న్యాయవాదిగా వ్యవహరించారు. సతీష్ నియామకం పట్ల విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎం.కె.శ్రీనివాస్, కార్యదర్శి లాలం పార్వతి నాయుడు, సీనియర్ న్యాయవాది భక్తి రాజశేఖర్, రాష్ట్ర బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు ఎస్.కృష్ణమోహన్, మాజీ ఉపాధ్యక్షుడు రామ జోగేశ్వరరావు అభినందనలు తెలిపారు.

అడుగేస్తే.. గాల్లో తేలేలా..

- విశాఖ పర్యాటకానికి సరికొత్త ఆకర్షణ
- తుది దశకు చేరుకున్న కైలాసగిరిపై 55 మీటర్ల గాజు వంతెన
- వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రాజెక్టుకు శ్రీకారం
- త్వరలో ప్రారంభించేందుకు వీఎంఆర్డీఏ సన్నాహాలు





కైలాసగిరిపై గ్లాస్ బ్రిడ్జ్

విశాఖ సిటీ: తూర్పు కనుమలను తిలకిస్తూ.. సాగర సోయగాలను వీక్షిస్తూ.. గాల్లో తేలియాడే సరికొత్త అనుభూతిని అందించేందుకు విశాఖలో మరో పర్యాటక ఆకర్షణ సిద్ధమవుతోంది. పర్యాటకులను మంత్రముగ్ధులను చేసేందుకు కైలాసగిరిపై గ్లాస్ బ్రిడ్జ్ రూపుదిద్దుకుంటోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పునాది రాయి పడిన ఈ పర్యాటక ప్రాజెక్టు పనులు తుది దశకు చేరుకున్నాయి. ఇప్పటికే దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. రూ.10 కోట్ల వ్యయంతో పీపీపీ పద్ధతిలో చేపట్టిన ఈ ప్రాజెక్టు త్వరలో ప్రారంభానికి ముస్తాబవుతోంది.

వైఎస్సార్‌సీపీ హయాంలో పర్యాటకానికి పెద్దపీట

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో విశాఖలో పర్యాటకాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. గతంలో ఎన్నడూలేని విధంగా అంతర్జాతీయ స్థాయిలో పర్యాటక ప్రాజెక్టులకు ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇందులో భాగంగా కైలాసగిరిపై చేపట్టిన ప్రాజెక్టులు ఇప్పుడు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. 2019 వరకు కైలాసగిరిపై కేవలం రోప్ వే, సర్క్యూట్ ట్రైన్, శివపార్వతుల విగ్రహాలు తప్ప మరో సందర్శనీయ, ఆహ్లాదాన్ని పంచే ప్రాజెక్టులు లేవు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పీపీపీ పద్ధతిలో స్కై సైక్లింగ్, జిప్‌లైనర్, గ్లాస్ బ్రిడ్జ్ పనులను ప్రారంభించారు. ఇప్పటికే గ్లాస్ బ్రిడ్జ్ మినహా మిగిలిన రెండు ప్రాజెక్టులు పర్యాటకులకు థ్రిల్‌ను పంచుతున్నాయి. వీటితో పాటు సైన్స్ మ్యూజియం, రివాల్వింగ్ రెస్టారెంట్, కాటేజీలకు ప్రణాళికలు సిద్ధం చేసినప్పటికీ, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ ప్రతిపాదనలు ముందుకు సాగలేదు. అయితే గత ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన గ్లాస్ బ్రిడ్జ్ పనులు ఇప్పుడు తుది దశకు చేరుకున్నాయి.

గాల్లో తేలియాడే అనుభూతి

విశాఖలోని పర్యాటక ప్రాంతాల్లో కైలాసగిరికి ప్రత్యేక స్థానం ఉంది. నిత్యం వేలాది మంది ఈ శిఖర దర్శనానికి వస్తుంటారు. ఇక్కడికి వచ్చే పర్యాటకులకు సరికొత్త అనుభూతిని అందించేందుకు, గాల్లో తేలియాడేలా నిర్మించిన గ్లాస్ బ్రిడ్జ్ పనులు దాదాపుగా పూర్తయ్యాయి. దేశంలోనే అతిపెద్ద గాజు వంతెనల్లో ఒకటిగా నిలవనున్న ఈ నిర్మాణం .. విశాఖ పర్యాటకానికి అదనపు ఆకర్షణ కానుంది. గతంలో కైలాసగిరి కొండ ప్రారంభంలో ఉన్న టైటానిక్ వ్యూ పాయింట్ శిథిలమైంది. దాని స్థానంలో వీఎంఆర్డీఏ పీపీపీ పద్ధతిలో 55 మీటర్ల పొడవుతో ఈ గాజు వంతెనను నిర్మించింది. ఒకేసారి 100 మంది నిలబడే సామర్థ్యంతో దీనిని నిర్మించినా, భద్రతా కారణాల దృష్ట్యా ఒక విడతకు 40 మందిని మాత్రమే అనుమతించాలని అధికారులు నిర్ణయించారు. దీనిపై నడిచేటప్పుడు గాల్లో తేలుతున్న అనుభూతి కలుగుతుంది. దీనిపై నుంచి చూస్తే చుట్టూ ఎత్తయిన కొండలు, కింద కైలాసగిరి లోయ, అద్భుతమైన సాగర సోయగాలు చూపరులను మంత్రముగ్ధులను చేస్తాయనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. పెద్దలతో పాటు పిల్లలు కూడా ఆస్వాదించేందుకు వీలుగా పటిష్టమైన భద్రతా ప్రమాణాలను ఏర్పాటు చేశారు.

‘ఓపెన్ ఎయిర్’ స్పెషల్



జైల్ లోపల వ్యవసాయం చేస్తున్న ఖైదీలు

30 మంది ఖైదీలకు స్వేచ్ఛ

ఆరిలోవ: సాధారణంగా జైలు అనగానే నాలుగు గోడల మధ్య ఉండే ఖైదీలు గుర్తుకు వస్తారు. కానీ విశాఖ కేంద్ర కారాగారంలో నిర్వహిస్తున్న ‘ఓపెన్ ఎయిర్ జైలు’మాత్రం ఖైదీలకు కొంత స్వేచ్ఛను కల్పిస్తోంది. ఈ ప్రత్యేకమైన జైలులో ప్రస్తుతం 30 మంది ఖైదీలు ఉన్నారు. సాధారణ జైలు ఖైదీలతో పోలిస్తే.. ఓపెన్ ఎయిర్ జైలులో ఉన్నవారికి ప్రత్యేక సౌకర్యాలు లభిస్తాయి. ముఖ్యంగా మంచి ప్రవర్తన ఉన్న ఖైదీలను జైలు అధికారులు ఈ విభాగం కింద ఎంపిక చేస్తారు. వారిని జైలులో వ్యవసాయం, పాడి పరిశ్రమ, సుధార్ కేంద్రాల్లో పనిచేయడానికి అవకాశం కల్పిస్తారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వీరు ఈ పనుల్లో నిమగ్నమై, తిరిగి సాయంత్రానికి జైలు లోపలికి చేరుకుంటారు. ఒక ఖైదీని ఓపెన్ ఎయిర్ జైలుకు ఎంపిక చేయడానికి కొన్ని నిబంధనలు ఉన్నాయి. వారి ప్రవర్తన బాగుండడంతో పాటు, వారు పెరోల్‌కు, ఫర్లోకు ఇంటికి వెళ్లొచ్చి ఉండాలి. అలాగే కుటుంబ సభ్యులతో వారికి ఉన్న సంబంధాలు తెగిపోకుండా ఉండాలి. ఈ అర్హతలు ఉన్న వారిని, జైలు అధికారుల పూర్తి నమ్మకం చూరగొన్న వారిని మాత్రమే ఈ ప్రత్యేక జైలుకు ఎంపిక చేస్తారు. ఇలాంటి ఖైదీలు చాలా మంది శిక్ష కాలం పూర్తవక ముందే క్షమాభిక్ష పొందే అవకాశాలు కూడా ఉంటాయి. ఓపెన్ ఎయిర్ జైలులో పనిచేస్తున్న ఖైదీలకు సెమీ–స్కిల్డ్ విభాగం కింద రోజుకు రూ.180 వేతనం ఇస్తారు. మన దేశంలో 17 రాష్ట్రాల్లో 91 కేంద్ర కారాగారాల్లో ఇలాంటి ఓపెన్ ఎయిర్ జైళ్లు ప్రస్తుతం పనిచేస్తున్నాయి.



సుధార్ కేంద్రం

ఉత్తమ గురువులకు పురస్కారాలు

ఆరిలోవ: సమాజమనే సౌధానికి గురువులే పునాది రాళ్లు. తమ జ్ఞానమనే దీపంతో వేలాది విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపుతూ, వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే నిస్వార్థ శిల్పులు ఉపాధ్యాయులు. ఈ నెల 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యా య పురస్కారాలకు జిల్లా నుంచి ముగ్గురు గురువులు ఎంపికయ్యారు. వారి అంకితభావానికి, కృషికి దక్కిన గౌరవమిది. ఆ రోజున అమరావతిలో ఈ పురస్కారాలను అందుకోనున్నారు.

ఆంగ్ల బోధనలో మేటి



గాజువాక: అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న గుడిమెట్ల కుమారస్వామి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడి పురస్కారానికి ఎంపికయ్యారు. 35 ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్న ఆయన.. గత రెండేళ్లుగా అక్కిరెడ్డిపాలెం పాఠశాలలో సేవలందిస్తున్నారు. బోధనలో తనకంటూ ప్రత్యేక శైలిని ఏర్పరచుకున్న ఆయన 2019 లోనే జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డును అందుకున్నారు. 2021లో 7వ తరగతి విద్యార్థుల కోసం ఒక ఆంగ్ల పాఠ్య పుస్తకాన్ని రచించారు. ఆ పుస్తకాన్ని రాష్ట్ర ప్రభుత్వం 2023 వరకు అధికారికంగా అమలులో ఉంచింది. ఆ తర్వాత సీబీఎస్ఈ సిలబస్ అమలు కావడంతో పుస్తకాలు మారాయి. బోధనాంశాల్లో వస్తున్న నూతన మార్పులకు అనుగుణంగా విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించడంలో కుమారస్వామి దిట్ట అని తోటి ఉపాధ్యాయులు ప్రశంసిస్తున్నారు.

సేవా నిరతికి నిలువుటద్దం



పెదగంట్యాడ: యారాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న గద్దం మేరీ సుజాత తన విశేష సేవలకుగాను రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయినిగా ఎంపికయ్యారు. మచిలీపట్నంలో జన్మించిన ఆమె, 1997లో మాడుగులలో తన ఉపాధ్యాయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. పలు పాఠశాలల్లో పనిచేసి, 2024లో యారాడ ఉన్నత పాఠశాలకు బదిలీపై వచ్చారు. కేవలం బోధనకే పరిమితం కాకుండా, పాఠశాల అభివృద్ధిని తన బాధ్యతగా స్వీకరించా రు. తన సొంత నిధులతో పాఠశాలకు అవసరమైన సామగ్రిని సమకూర్చారు. విద్యార్థులతో కలిసి మొక్కలు నాటి, పాఠశాల ప్రాంగణాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. అంతేకాకుండా విద్యార్థులను సామాజిక కార్యక్రమాలలో భాగస్వాములను చేస్తూ వారిలో బాధ్యతను పెంపొందిస్తున్నారు. ఆ మె నిస్వార్థ సేవకు ఈ పురస్కారం సరైన గుర్తింపు అని తోటి ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థుల అభివృద్ధే ధ్యేయం



గోపాలపట్నం: జీవీఎంసీ 91వ వార్డు లక్ష్మీనగర్–ఈ బ్లాక్ మండల పరిషత్ పాఠశాలలో పనిచేస్తున్న మెట్ట మోహనరావు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. 1995లో బుచ్చయ్య పేట మండలం పంగిడిలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడిగా వృత్తి జీవితం ప్రారంభించిన ఆయన.. 30 ఏళ్లుగా విద్యారంగానికి సేవలందిస్తున్నారు. గత పదేళ్లుగా లక్ష్మీనగర్ పాఠశాలలో పనిచేస్తున్నారు. టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్స్ ద్వారా విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా బోధించడం ఆయన ప్రత్యేకత. తాను పనిచేసిన ప్రతి పాఠశాలను స్థానికుల సహకారంతో అభివృద్ధి పథంలో నడిపించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు స్వయంగా ప్రచారం చేపడుతుంటారు. తన సొంత ఖర్చులతో విద్యార్థులను విజ్ఞాన యాత్రలకు తీసుకెళ్తూ, వారికి బాహ్య ప్రపంచంపై అవగాహన కల్పిస్తున్నారు. ఆయనకు సహచరులు అభినందనలు తెలిపారు.

పక్కా కమర్షియల్



వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయం

- పట్టుకుంటారు.. ఫైనలిస్తే వదిలేస్తారు..!
- వాణిజ్య పన్నుల శాఖలో వింత దాడులు
- భారీగా బిల్లులు లేని సరకులు స్వాధీనం
- ఆపై వ్యాపారులతో బేరసారాలకు ప్రత్యేక బృందాలు
- విదేశీ సిగరెట్స్, రెడీమేడ్ వస్త్రాలు, బోట్ ఇంజిన్ల రవాణాలో భారీ వసూళ్లు

- కోల్‌కతా నుంచి బిల్లులు లేకుండా రెడీమేడ్ దుస్తుల బేల్స్ విశాఖ రైల్వే స్టేషన్‌కు చేరుకుంటాయి. దాదాపు రూ.5 లక్షల వరకు పన్ను ఎగ్గొట్టి వ్యాపారులు వాటిని తీసుకొస్తారు. విషయం తెలుసుకుని వాణిజ్య పన్నుల శాఖ అధికారులు వలపన్ని పట్టుకుంటారు. పక్కా ఆధారాలతో వాటిని సీజ్ చేస్తారు. కానీ.. తెల్లారితే అవన్నీ అక్రమం కాదు.. సక్రమమని నిర్ధారించేస్తారు.
- ఒడిశా నుంచి రూ.లక్షల విలువ చేసే ఫిష్ బోట్ ఇంజిన్లను వాణిజ్య పన్నుల శాఖ అధికారులు పట్టుకుంటారు. పట్టుకునేటప్పుడు 50 వరకు ఇంజిన్లు ఉంటాయి. ఫైన్ వేసేటప్పుడు మాత్రం .. ఒక్కటే పట్టుకున్నట్లు చూపిస్తారు.
- విదేశీ సిగరెట్లు.. వివిధ రకాల సరకులు... ఇలా కమర్షియల్ ట్యాక్స్ ఆధ్వర్యంలో జరిగే దాడుల్లో పట్టుబడుతుంటాయి. కానీ అబ్రకదబ్రద అనగానే గుట్టుచప్పుడు కాకుండా అవన్నీ మాయమైపోతుంటాయి.
- విశాఖ డివిజన్ వాణిజ్య పన్నుల శాఖలో ఇలా వింత దాడులు జరుగుతున్నాయి. భారీగా బిల్లులు లేని సరకులు పట్టుకున్నా.. ముడుపులు ముడితే చాలు.. అవన్నీ సక్రమమేనంటూ సర్టిఫైడ్ చేస్తున్నారన్న ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి.

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ విశాఖ డివిజన్‌లో అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలు తీవ్రమవుతున్నాయి. డివిజన్ పరిధిలోని వివిధ సర్కిళ్లలో జరుగుతున్న తనిఖీల్లో వసూలు చేయాల్సిన జరిమానాలో 90 శాతం వరకు ప్రభుత్వానికి చేరకుండా, సిబ్బంది జేబుల్లోకి వెళ్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. డివిజన్‌లో విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాల పరిధిలో 14 సర్కిళ్లు ఉన్నాయి. విశాఖ పరిధిలోని కురుపాం, గాజువాక, సిరిపురం, స్టీల్‌ప్లాంట్, భీమిలి, ఎయిర్‌పోర్టు, అనకాపల్లి జిల్లాలోని అచ్యుతాపురం, అల్లూరి జిల్లాలోని పాడేరు సర్కిళ్లలో వసూళ్ల పర్వం కొనసాగుతున్నట్లు ఆరోపణలున్నాయి. డివిజన్ ప్రధాన కార్యాలయంలోని కొందరు ఉద్యోగుల సహకారంతో సర్కిళ్ల పరిధిలో దందా నడుస్తున్నట్లు తెలుస్తోంది.

వసూళ్లకు ప్రత్యేక సిబ్బంది

నిబంధనలకు విరుద్ధంగా తనిఖీల సమయంలో పట్టుబడిన సరకులకు సంబంధించి జరిమానా బదులు.. వ్యాపారులతో బేరసారాలు జరుగుతున్నాయని తెలుస్తోంది. ఇంటెలిజెన్స్ విభాగం, ప్రధాన కార్యాలయం, సంబంధిత సర్కిల్ సిబ్బంది కలిసి ఈ వసూళ్లకు పాల్పడుతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ముడుపులు అందిన తర్వాత సరకులకు బిల్లులు ఉన్నట్లు ధ్రువీకరించి, నామమాత్రపు జరిమానాతో వ్యవహారాన్ని ముగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల పట్టుబడిన భారీ విదేశీ సిగరెట్లు, వస్త్రాలు, బోట్ ఇంజిన్ల విషయంలోనూ ఇదే పద్ధతిని అనుసరించారని తెలుస్తోంది.

నకిలీ ఇన్‌వాయిస్‌లతో మోసం

బిల్లులు లేని సరకులతో పాటు నకిలీ ఇన్‌వాయిస్‌ల ద్వారా కూడా ప్రభుత్వానికి పెద్ద ఎత్తున ఆదాయం నష్టం జరుగుతోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖలోని కొందరు ఉద్యోగులు వ్యాపారులతో చేతులు కలిపి ఈ అక్రమాలకు పాల్పడుతున్నారని సమాచారం. నకిలీ కంపెనీలను సృష్టించి, తప్పుడు ఇన్‌వాయిస్‌లు తయారు చేయడం ద్వారా 'ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్' ను అక్రమంగా పొందడానికి ఉద్యోగులు సహకరిస్తున్నారని తెలుస్తోంది. ఏ సమయంలో ఇన్‌వాయిస్‌లు సమర్పిస్తే అనుమానం రాకుండా ఉంటుందో, వెరిఫికేషన్ జరగకుండా ఎలా చూసుకోవాలో వంటి విషయాల్లో వీరు వ్యాపారులకు సహాయం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా సూర్యాబాగ్, సిరిపురం, ద్వారకానగర్, గాజువాక, అనకాపల్లి వంటి సర్కిళ్ల పరిధిలో ఈ తరహా మోసాలు ఎక్కువగా జరుగుతున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ ఖజానాకు కన్నం వేస్తున్న ఈ సిబ్బంది, వ్యాపారులతో కలిసి అక్రమంగా సంపాదించిన మొత్తాన్ని పంచుకుంటున్నారని సమాచారం. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడటంతో ఈ అక్రమాలు అడ్డూ అదుపు లేకుండా సాగుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

కదంతొక్కిన ఉక్కు కార్మికులు

- ఈవోఐను రద్దు చేయాలి.. ప్రైవేటీకరణ ఆపాలి
- విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా భారీ ర్యాలీ
- కలెక్టరేట్ ఎదుట బైఠాయింపు



డీఆర్వో భవానీశంకర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న జేఏసీ ప్రతినిధులు



కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన కార్మికులు, కార్మిక సంఘాల నేతలు

మహారాణిపేట: ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ (ఈవోఐ) పేరుతో విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరించడం తగదని, వెంటనే ఈవోఐను రద్దు చేయాలని, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపాలని డిమాండ్ చేస్తూ కార్మికులు భారీ నిరసన చేపట్టారు. తొలగించిన కాంట్రాక్టు కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. విశాఖ జిల్లా కార్మిక, ప్రజా సంఘాల జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం జరిగిన ర్యాలీ, కలెక్టరేట్ ఎదుట బైఠాయింపులో పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు. తొలుత జగదాంబ జంక్షన్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ ఎదుట రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం డీఆర్వో భవానీశంకర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ ఈవోఐని రద్దు చేయాలని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను నిలిపివేస్తూ కేంద్ర ప్రభుత్వం తక్షణమే ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. చట్టవిరుద్ధంగా తొలగించిన 5 వేల మంది కాంట్రాక్టు కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలని కోరారు. జేఏసీ వైస్ చైర్మన్ ఎం.మన్మథరావు మాట్లాడుతూ కూర్మన్నపాలెం వద్ద నిరాహార దీక్ష శిబిరానికి అనుమతి ఇవ్వాలని, ప్లాంట్‌లో ఉద్యోగ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. నిర్వాసితులకు ఉద్యోగాలు ఇవ్వాలని, ఉద్యోగులకు, కార్మికులకు వేతన బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ, ఐఎన్‌టీయూసీ, ఏఐసీటీయూసీ, ఏపీఎఫ్‌టీయూ తదితర సంఘాల ప్రతినిధులు ఆర్.కె.ఎస్.వి.కుమార్, నాగభూషణం, దేవ, డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, ఎస్.కె.రెహ్మాన్, వై.సత్యవతి, యు.ఎస్.ఎన్.రాజు, పి.అజయ్, యు.నాగరాజు, కె.అచ్యుతరావు, రైతు సంఘం నాయకులు జి.నాయన బాబు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ విభాగాన్ని బలోపేతం చేయాలి

వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు

మహారాణిపేట : వైఎస్సార్ సీపీకి వలంటీర్ విభాగం వెన్నుముక వంటిదని, ఆ విభాగాన్ని సంస్థాగతంగా బలోపేతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు సూచించారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటికే హామీ ఇచ్చారని గుర్తు చేశారు. మద్దిలపాలెంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జిల్లా వలంటీర్ విభాగం అధ్యక్షుడు పీలా ప్రేమ్ కిరణ్ ఆధ్వర్యంలో విశాఖ జిల్లా వలంటీర్ విభాగం సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో కె.కె.రాజుతో పాటు వలంటీర్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నాగార్జున యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా 14 నెలలపాటు కాలయాపన చేసిందని విమర్శించారు. సంక్షేమ పథకాలను పూర్తి స్థాయిలో అమలు చేయడం లేదని ఆరోపించారు. ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటినీ పూర్తి స్థాయిలో అమలు చేసే వరకూ ప్రజల తరఫున పోరాడి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు. అంతేకాకుండా స్థానికంగా కూటమి ప్రజాప్రతినిధులు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకూ ప్రజల తరఫున పోరాడాలని సూచించారు. ఈ సమావేశంలో పులగం శ్రీనివాస రెడ్డి, పి.రాము, బి.శ్రీనివాస్, మొల్లి వెంకటరమణ, మామిడి శ్రీను, సునీల తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: ఏసీఐఏఎం, ఎన్ఎల్ఐయూ భోపాల్ సంయుక్త ఆధ్వర్యంలో రాడిసన్ బ్లూ రిసార్ట్‌లో ఈ నెల 5న నిర్వహించనున్న నేషనల్ మీడియేషన్ కాన్ఫరెన్స్‌లో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు విచ్చేస్తున్న నేపథ్యంలో కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఏర్పాట్లు పరిశీలించారు. ముఖ్యమంత్రి ఆ రోజు ఉదయం తాడేపల్లి నుంచి నేరుగా రుషికొండ హెలీప్యాడ్ వద్దకు చేరుకోనున్నందున బుధవారం సాయంత్రం రుషికొండ హెలీప్యాడ్‌ను, రాడిసన్ బ్లూ రిసార్ట్‌ను సందర్శించారు.

అప్పలరాజుకు రాంపాల్ సింగ్ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం



రెడ్డిపల్లి అప్పలరాజు

తగరపువలస: అఖిల భారత ప్రాథమిక ఉపాధ్యాయ సమాఖ్య మాజీ అధ్యక్షుడు రాంపాల్ సింగ్ పేరుమీద నెలకొల్పిన జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు భీమిలి జోన్ ఒకటోవార్డు సంతపేట అంబేడ్కర్ జీవీఎంసీ హైస్కూల్‌కు చెందిన ఉపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు ఎంపికయ్యారు. ఉత్తరప్రదేశ్ బందాలోని రాంపాల్‌సింగ్ ఉత్తమ ఉపాధ్యాయ సెలక్షన్ కమిటీ ఫౌండేషన్ ప్రధానకార్యదర్శి ప్రేమ్‌కుమార్ సింగ్ ఈ మేరకు సమాచారం అందించారు. అప్పలరాజుకు ఈ నెల 22న బందాలో మొమెంటో, సర్టిఫికెట్, నగదు బహుమతి అందించనున్నారు. సాయి సంహిత ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు చేస్తున్న అప్పలరాజును పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

సింహగిరిపై రెండో రోజు పవిత్రోత్సవాలు

సింహాచలం: సింహగిరిపై రెండో రోజు బుధవారం పవిత్రోత్సవాలు వైభవంగా జరిగాయి. ఉదయం పవిత్రాదివాసం, చక్రాబ్జమండల రచనం, ఆవాహనం, పవిత్ర ప్రతిష్ట కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. స్వామి ఉత్సవమూర్తులను, సుదర్శన పెరుమాళ్లను వేదికపై వేంజేపచేశారు. నాలుగు వేదాలు, దివ్యప్రబంధాలు, సింహాచలం క్షేత్రమహత్యం విన్నప పారాయణంతో కొలిచారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు కరి సీతామాచార్యులు, అర్చకులు, పారాయణదారులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

టీడీఆర్ బాండ్లు వద్దే వద్దు..

- వీఎంఆర్డీఏ ఎదుట అనకాపల్లి–అచ్యుతాపురం రోడ్డు నిర్వాసితుల నిరసన
- నగదు రూపంలోనే పరిహారం చెల్లించాలని డిమాండ్

సాక్షి, అనకాపల్లి:

అనకాపల్లి–అచ్యుతాపురం రోడ్డు విస్తరణ బాధితులు కదంతొక్కారు. నష్టపరిహారాన్ని టీడీఆర్ బాండ్ల రూపంలో కాకుండా నగదు రూపంలోనే అందించాలని డిమాండ్ చేస్తూ విశాఖలోని వీఎంఆర్డీఏ కార్యాలయం ఎదుట బుధవారం నిరసనకు దిగారు. ఇళ్లు, దుకాణాలు, భూములకు ఒకేసారి నష్టపరిహారం చెల్లించాలని నినదించారు. అనంతరం రోడ్డు విస్తరణ నిర్వాసితుల సంఘం కన్వీనర్ ఆర్.రాము ఆధ్వర్యంలో నిర్వాసితులు వీఎంఆర్డీఏ కమిషనర్ విశ్వనాథన్‌కు వినతిపత్రం అందజేశారు. గతంలో నిర్వహించిన గ్రామ సభల్లో టీడీఆర్ బాండ్లు వద్దని నిర్వాసితులంతా ముక్తకంఠంతో వ్యతిరేకించారని, అయినా టీడీఆర్ బాండ్లే ఇస్తామని అధికారులు పలు ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ వాపోయారు. మరోవైపు మూడు రోజుల క్రితం అనకాపల్లి–అచ్యుతాపురం రోడ్డు విస్తరణ నిర్వాసితులకు టీడీఆర్ బాండ్లు ఇవ్వాలంటూ కూటమి ప్రభుత్వం జీవో జారీ చేయడంపై మండిపడ్డారు. నిర్వాసితులంతా పేదవారని, వారికి టీడీఆర్ బాండ్లు ఏమాత్రం ఉపయోగపడవని, 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నగదు రూపంలో నష్ట పరిహారం అందించి, తమకు పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధి కోల్పోయిన చిరు వ్యాపారులకు పరిహారం ఇవ్వడంతో పాటు ప్రభుత్వమే ఉపాధి కల్పించాలన్నారు. 100 అడుగుల తర్వాత నిర్మించుకునే ఇళ్లకు ఎటువంటి నిబంధనలు విధించరాదన్నారు.



టీడీఆర్ బాండ్లు మాకొద్దు అంటూ విశాఖలో వీఎంఆర్‌డీఏ ఎదుట నినదిస్తున్న నిర్వాసితులు

మూడు నియోజకవర్గాలు.. 1225 మంది బాధితులు

అనకాపల్లి–అచ్యుతాపురం రోడ్డు విస్తరణ కోసం మూడు నియోజకవర్గాల పరిధిలో 125 ఎకరాలను ప్రభుత్వం సేకరించింది. ఈ భూముల్లో దాదాపుగా 1225 మంది నిర్వాసితులున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత దేవుడి మాన్యంలో ఉన్న 12 మంది నిర్వాసితులకు, ఆర్అండ్‌బీ, పీడబ్ల్యూ స్థలాల్లో ఉన్న 62 మంది నిర్వాసితులకు బలవంతంగా టీడీఆర్ బాండ్లు ఇచ్చారు. మిగిలిన నిర్వాసితులెవ్వరూ టీడీఆర్ బాండ్లు తీసుకోకుండా వ్యతిరేకించారు.

కమిషనర్‌కు వినతి ఇస్తే.. సమాధానమే లేదు



మాకు టీడీఆర్ బాండ్లు వద్దు.. నష్ట పరిహారంగా నగదు ఇవ్వాలి. 2023లో గ్రామాల వారీగా ధర నిర్ణయించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నష్ట పరిహారం ఇవ్వడానికి అంతా సిద్ధం చేశారు. ఆ సమయంలో ఎన్నికల కోడ్ వచ్చింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఆ జీవో రద్దు చేశారు. గత నెల 31న టీడీఆర్ బాండ్లు ఇస్తామంటూ జీవో ఇచ్చారు. వీఎంఆర్డీఏ కమిషనర్‌ను కలిసి టీడీఆర్ బాండ్లు వద్దు అని కోరాం. మాకు సంబంధం లేదని సమాధానం చెప్పకుండా వెళ్లిపోయారు.

– కర్రి అప్పారావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు, తిమ్మరాజు పేట, అచ్యుతాపురం మండలం

సుగాలి ప్రీతి కేసుపై హైలెవల్ కమిటీ వేయాలి

వైఎస్సార్ సీపీ డిమాండ్

సాక్షి, విశాఖపట్నం: సుగాలి ప్రీతి కేసుకు సంబంధించి హైలెవల్ కమిటీని ఏర్పాటు చేసి, అందులో సీబీఐని భాగస్వామ్యం చేయాలని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ కుంభా రవిబాబు డిమాండ్ చేశారు. మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షురాలు కె.భాగ్యలక్ష్మి, జీసీసీ మాజీ చైర్‌పర్సన్ స్వాతిరాణితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. '2017లో టీడీపీ ప్రభుత్వ హయాంలో గిరిజన బాలిక సుగాలి ప్రీతి హత్య జరిగింది. అప్పటి ప్రభుత్వం ఈ కేసును మసిపూసి మారేడుకాయ చేసింది. ప్రీతిని అత్యంత పాశవికంగా హత్య చేసినా, నిందితులను చంద్రబాబు ప్రభుత్వం అప్పుడు, ఇప్పుడు కాపాడుతోంది. ఇప్పుడు జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ కూడా ఇదే చేస్తున్నారు. ఎన్నికలకు ముందు ఈ కేసు గురించి ఊగిపోయి మాట్లాడిన పవన్, అధికారంలోకి వచ్చాక పట్టించుకోవడం లేదు. సుగాలి ప్రీతి తల్లి కూడా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తమను ఆదుకున్నారని, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత న్యాయం జరగడం లేదని మీడియా సాక్షిగా వాపోయారు. ఆదివాసీలంటే చంద్రబాబుకు ఎప్పుడూ చిన్నచూపే..' అని రవిబాబు అన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఈ కేసును వాడుకున్నారని ఆరోపించిన రవిబాబు.. సుగాలి ప్రీతి కుటుంబానికి న్యాయం జరగకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. సుగాలి ప్రీతి కోసం ఎక్కడ పోరాటం జరిగినా.. వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందన్నారు. సమావేశంలో రాష్ట్ర ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ నాయక్, నంద్యాల ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి నాగసారి సుంకన్న, అల్లూరి జిల్లా సోషల్ మీడియా విభాగం అధ్యక్షుడు డాక్టర్ టి.సురేష్‌కుమార్, ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి దండు మధు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రవిబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, జీసీసీ మాజీ చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి

సుగాలి ప్రీతికి న్యాయం జరగాల్సిందే..

దళిత, ఆదివాసీ సంఘాల నాయకులు

అల్లిపురం/ఎంవీపీకాలనీ: గిరిజన బాలిక సుగాలి ప్రీతి హత్య కేసు విచారణలో రాష్ట్ర ప్రభుత్వం అలసత్వం ప్రదర్శిస్తోందని దళిత, ఆదివాసీ సంఘాల నాయకులు మండిపడ్డారు. ఆమెను దారుణంగా హత్య చేసి ఎనిమిదేళ్లు గడిచినా నిందితులను పట్టుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందని ఆరోపించారు. అల్లిపురంలో న్యూ హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన 'జస్టిస్ ఫర్ సుగాలి ప్రీతి' రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జైభీమ్ భారత్ వ్యవస్థాపకుడు జడ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ నిందితులను తప్పించడానికే అభియోగ పత్రంలో అత్యాచారం, హత్య సెక్షన్లను తొలగించారని ఆరోపించారు. నిందితులకు శిక్ష పడితేనే అసలైన న్యాయం జరుగుతుందన్నారు. న్యూ హోప్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ మంచా నాగ మల్లేశ్వరి మాట్లాడుతూ గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే ఈ దారుణం జరిగిందన్నారు. ఇప్పు డు కూడా కూటమి ప్రభుత్వం అధికారంలోనే ఉందని, రాజకీయ ఒత్తిడితోనే ఈ కేసును నీరుగారుస్తున్నారని విమర్శించారు. న్యాయవాది సలీం మాట్లాడుతూ దళిత, ఆదివాసీలకు అన్నివిధాలా అండగా నిలుస్తామన్నారు. సుగాలి ప్రీతి కుటుంబానికి న్యాయం చేసేందుకు ఒక సమన్వయ కమిటీని ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. గవర్నర్, రాష్ట్రపతిని కలిసి వినతిపత్రాలు సమర్పించాలని తీర్మానించారు. సమావేశంలో జై భీమ్ భారత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్, ఆదివాసీ చైతన్య వేదిక అధ్యక్షుడు ఎస్.చొక్కారావు, పలు సంఘాల ప్రతినిధులు ఉమామహేశ్వరరావు, అప్పన్న, భవానీశంకర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎంవీపీ కాలనీలోని గిరిజన భవన్‌లో జరిగిన సమావేశంలో జడ శ్రావణ్‌కుమార్ మాట్లాడారు. సుగాలి ప్రీతి హత్య కేసు విచారణలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం దారుణమన్నారు.



సమావేశంలో పాల్గొన్న దళిత, ఆదివాసీ నాయకులు

సీఐపీఈటీతో సింహాద్రి ఎన్టీపీసీ ఒప్పందం

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ పరిసర ప్రాంతాల యువతకు నైపుణ్యాభివృద్ధిశిక్షణ ద్వారా ఉపాధి, ఆదాయ వనరులను కల్పించేందుకు సింహాద్రి ఎన్టీపీసీ కృషి చేస్తుందని సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ప్రాజెక్టు హెడ్ సమీర్‌శర్మ అన్నారు. యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ కల్పించేందుకు వీలుగా విజయవాడలోని సీఐపీఈటీతో ఎన్టీపీసీ సింహాద్రి బుధవారం ఒప్పందం కుదుర్చుకుంది. అనంతరం సంస్థ ఈడీ సమీర్‌శర్మ మాట్లాడుతూ నైపుణ్యాభివృద్ధి శిక్షణను యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సంస్థ సీఎస్సార్ విభాగం సౌజన్యంతో పరవాడ ప్రాంతంలోని నిరుద్యోగ యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించి తద్వారా వారి జీవన ప్రమాణాలు మెరుగుపర్చడానికి వీలుగా సీఐపీఈటీతో ఈ ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. ఒప్పందం మేరకు 2025–26లో మూడు బ్యాచ్‌లకు వసతులతో కూడిన శిక్షణ కల్పించనున్నారు. బ్యాచ్‌కు 30 మంది చొప్పున శిక్షణ పొందుతారు. మెషిన్ ఆపరేటర్–ఇంజెక్షన్ మోడలింగ్, మెషిన్ ఆపరేటర్–ప్లాస్టిక్ ప్రాసెసింగ్‌లో నాలుగు నెలల పాటు శిక్షణ కల్పిస్తారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



ఒప్పంద పత్రాలను చూపుతున్న సింహాద్రి ఎన్టీపీసీ ఈడీ సమీర్‌శర్మ, సీఐపీఈటీ అధికారులు

అభివృద్ధి పనులపై సమీక్ష

తాటిచెట్లపాలెం : ఈస్ట్ కోస్ట్ రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ (పీసీసీఎం) రీటా రాజ్ బుధవారం విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో పర్యటించారు. రీటారాజ్ పీసీసీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా విశాఖలో పర్యటించారు. ప్రయాణికుల సౌకర్యాలు, వసతులు, అభివృద్ధి పనులను పరిశీలించారు. ముందుగా దొండపర్తిలో గల డివిజినల్ రైల్వే మేనేజర్ కార్యాలయంలో డీఆర్ఎం లలిత్ బోహ్రా, ఇతర ఉన్నతాధికారులతో ఆమె సమావేశమయ్యారు. కమర్షియల్ విభాగానికి చెందిన పలు అంశాలు, నాన్‌ఫేర్ రెవెన్యూకు సంబంధించిన ప్రాజెక్టులపై చర్చించారు. సీనియర్ డివిజినల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ డివిజన్ పరిధిలో ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులు, భవిష్యత్ ప్రణాళికలను వివరించారు. సమావేశంలో వాల్తేర్ డివిజన్ కమర్షియల్, ట్రాఫిక్ విభాగాల సీనియర్ అధికారులు పాల్గొన్నారు.



సమీక్ష చేస్తున్న పీసీసీఎం రీటా రాజ్

హత్య కేసులో వ్యక్తికి జీవిత ఖైదు

విశాఖ లీగల్ : కేవలం రూ.500 కోసం జరిగిన వివాదంలో ఒక వ్యక్తిని అతి కిరాతకంగా చంపిన నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ నగరంలోని రెండో అదనపు జిల్లా న్యాయమూర్తి గాయత్రి బుధవారం తీర్పునిచ్చారు. జైలు శిక్షతోపాటు రూ.3 లక్షల జరిమానా చెల్లించాలని తీర్పులో స్పష్టం చేశారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎన్.ఎస్.చంద్రశేఖర్ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. బుర్కా దుర్గారావు (34) నగరంలోని వన్‌టౌన్ ఏరియా పరిధిలోని ప్రసాద్ గార్డెన్స్‌లో ఉంటున్నాడు. వృత్తిరీత్యా ఆటోడ్రైవర్. అప్పుడప్పుడు ఇంటి పనులకు వెళుతూ ఉండేవాడు. 2016 సెప్టెంబరు 15వ తేదీకి కొన్ని రోజుల ముందు దుర్గారావు పండావీధిలోని నాగమల్లి జగదీష్ వద్ద ఇంటి సీలింగ్ పనికి రూ.500 అడ్వాన్స్ తీసుకున్నాడు. పనిచేయకపోవడంతో జగదీష్ తరచూ నిందితుడిని తన డబ్బులు వాపసు చేయాలని అడిగేవాడు. సెప్టెంబర్ 15న మధ్యాహ్నం 3 గంటల సమయంలో దుర్గారావు జగదీష్‌ల మధ్య గొడవ జరిగింది. ఈ గొడవలో దుర్గారావు పక్కనే ఉన్న జగదీష్ సోదరుడు శివకృష్ణను పదునైన చాకుతో పొడిచి తీవ్రంగా గాయపరిచాడు. శివకృష్ణ వారం రోజుల పాటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఒకటో పట్టణ సీఐ కె.వెంకట్రావు నిందితులపై కేసు నమోదు చేసి భారతీయ శిక్షాస్మృతి సెక్షన్ 302 కింద నేరాభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు.

ఈఎన్‌సీలో హిందీ పక్షోత్సవాలు ప్రారంభం



జ్ఞాపిక అందిస్తున్న అడ్మిరల్ మురళీమోహన్‌రాజు

సింధియా: తూర్పు నావికాదళ ప్రధాన కార్యాలయంలో సెప్టెంబర్ 2 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించనున్న హిందీ పక్షోత్సవాలను చీఫ్ స్టాఫ్ ఆఫీసర్ (పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేషన్) అడ్మిరల్ మురళీమోహన్‌రాజు ప్రారంభించారు. వేడుకల్లో భాగంగా హిందీ పోటీలు, వర్క్‌షాపులతో సహా పలు కార్యకలాపాలు నిర్వహించనున్నట్లు నేవీ వర్గాలు తెలిపాయి. సెప్టెంబర్ 17న సంస్థ హిందీ మ్యాగజైన్ పూర్వివాణి 31వ ఎడిషన్ ఆవిష్కరణతో వేడుకలు ముగుస్తాయని పేర్కొంది. ప్రారంభ వేడుకల్లో తూర్పు నావికాదళ పరిధిలోని వివిధ నౌకల సిబ్బంది, పలు సంస్థల పౌర సిబ్బంది పాల్గొన్నారు.

శ్లాబ్ పెచ్చులూడి తల్లీబిడ్డకు గాయాలు

స్థానికుల సహాయంతో కేజీహెచ్‌కు తరలింపు

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డు దుర్గమాంబ సమాజం వీధిలోని ఓ ఇంటి శ్లాబ్ పెచ్చులూడి పడటంతో తల్లీ కూతురుకు గాయాలయ్యాయి. ఇటీవల కురిసిన వర్షాల వల్ల ఇల్లు బాగా తడిసిపోయింది. ఆ ఇంట్లో నివాసం ఉంటున్న ముద్దా భువనేశ్వరి తన 13 నెలల కుమార్తెతో కలిసి మంగళవారం అర్ధరాత్రి నిద్రిస్తున్న సమయంలో ఒక్కసారిగా శ్లాబ్ పెచ్చులు ఊడి వారి మీద పడ్డాయి. ఈ ప్రమాదంలో తల్లీకూతుళ్లిద్దరికీ కాలిపై తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్పందించిన స్థానికులు వారిని కేజీహెచ్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు కనకరెడ్డి ప్రమాదానికి గురైన తల్లీబిడ్డలను పరామర్శించారు.





ఇంటి లోపల ఊడిన శ్లాబ్ (ఇన్‌సెట్) ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 13 నెలల పాప

ఏఎస్‌డబ్ల్యూవో నిర్లక్ష్యం

200 మందికి వేతనాల చెల్లింపులో జాప్యం

తగరపువలస: పాయకరావుపేట ఏఎస్‌డబ్ల్యూవో నిర్లక్ష్యం కారణంగా ఆగస్టు నెలకు సంబంధించి విశాఖ, అనకాపల్లి జిల్లాల్లోని సుమారు 200 మంది సాంఘిక సంక్షేమ వసతిగృహాల సిబ్బంది జీతాలు ఆలస్యం కానున్నాయి. సాంఘిక సంక్షేమ శాఖలో ఏపీసీవోలుగా పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల డ్యూటీ సర్టిఫికెట్లు ప్రతి నెలా 25లోగా విశాఖ, అనకాపల్లి జిల్లాలకు చెందిన భీమిలి, విశాఖపట్నం, నర్సీపట్నం, అనకాపల్లి, పాయకరావుపేట ఏఎస్‌డబ్ల్యూవోలు విశాఖలోని సాంఘిక సంక్షేమశాఖకు పంపించాలి. గత నెలలో నలుగురు ఏఎస్‌డబ్ల్యూవోలు డ్యూటీ సర్టిఫికెట్లు పంపించగా, పాయకరావుపేట నుంచి ఏఎస్‌డబ్ల్యూవో పంపించలేదు. ఫలితంగా సాంఘిక సంక్షేమశాఖలోని ఏపీసీవోలు, వార్డెన్లు, డిప్యూటీ డైరెక్టర్లు, సూపరింటెండింగ్ సిబ్బంది, ఇతర సిబ్బంది కలిపి సుమారు 200 మందికి జీతాలు నిలిచిపోయాయి. వీరికి ప్రతి నెలా ఒకటో తేదీకి జీతాలు అందవలసి ఉండగా, ఇప్పుడు 15రోజులు ఆలస్యమయ్యేలా ఉంది. ఏపీసీవోల డ్యూటీ సర్టిఫికెట్ల పంపించడంలో జాప్యం చేసిన ఏఎస్‌డబ్ల్యూవోకు గత నెల 30న డిప్యూటీ డైరెక్టర్ మెమో జారీ చేశారు. దీనిపై మూడు రోజులలోగా లిఖితపూర్వకంగా వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

కేజీహెచ్‌లో లైజనింగ్ అధికారి నియామకం

అనకాపల్లి టౌన్: జిల్లాలోని గిరిజనులకు కేజీహెచ్‌లో వైద్య సేవలందించేందుకు ట్రైబల్ సెల్‌లో బి.బెన్ని బాబు అనే లైజనింగ్ అధికారి నియమించినట్టు డీఎంహెచ్‌వో ఎం.హైమావతి తెలిపారు. కేజీహెచ్‌లో గిరిజనులకు ఇబ్బందులు తలెత్తకుండా తగిన సలహాలు, సూచనలు అందజేస్తారని చెప్పారు. ఆరోగ్యశ్రీ ద్వారా వర్తించని మందులు, టెస్ట్‌ల కోసం గిరిజన రోగులకు రూ.1500 నుంచి రూ.2000 వరకూ ఉచితంగా ఇవ్వనున్నట్లు ఆమె తెలిపారు. వైద్య సలహాల కోసం 9912415706 లో సంప్రదించాలన్నారు.

దీక్ష శిబిరంపై పోరాట కమిటీతో సమావేశం నేడు

ఉక్కునగరం: కూర్మన్నపాలెం దీక్ష శిబిరం అంశంపై గురువారం ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులతో యాజమాన్యం సమావేశం ఏర్పాటు చేసింది. కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ వ్యూహాత్మ అమ్మకంపై ప్రకటన చేసిన నాటి నుంచి ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలి వద్ద దీక్ష శిబిరం కొనసాగుతుంది. భారీ వర్షానికి దీక్ష శిబిరం పడిపోగా.. పునరుద్ధరణకు పోలీసులు నిరాకరించారు. దానికి తోడు ఆ ప్రాంతంలో కంచె ఏర్పాటు చేసి ప్రత్యేక బోర్డును తగిలించారు. పలుమార్లు పోలీస్ కమిషనర్‌ను కలిసి విజ్ఞప్తి చేసినప్పటికి అనుమతి లభించలేదు. ఈ క్రమంలో పోరాట కమిటీ హైకోర్టును ఆశ్రయించగా.. శిబిరం ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని పోలీస్ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేసింది. అయినా ఇప్పటి వరకు అనుమతి లభించలేదు. ఈ క్రమంలో శిబిరం అంశంపై ఉక్కు యాజమాన్యం సమావేశం ఏర్పాటు చేయడం గమనార్హం. మధ్యాహ్నం టౌన్ అడ్మిన్ విభాగం ఏర్పాటు చేయనున్న సమావేశంలో యాజమాన్యం తమ నిర్ణయం వెల్లడించనుండగా.. కార్మిక సంఘాలు తమ వాదన వినిపించనున్నారు.

ఉత్కంఠ పోరులో హర్యానా గెలుపు



కొనసాగిన పునేరి జోరు

విశాఖ స్పోర్ట్స్: నగరంలోని పోర్టు స్టేడియంలో జరుగుతున్న ప్రో కబడ్డీ లీగ్ 12వ సీజన్ స్థానిక క్రీడాభిమానులకు ఉత్కంఠతో పాటు ఉత్సాహం నింపుతోంది. బుధవారం జరిగిన మ్యాచ్‌లు అసలైన కబడ్డీ మజాను పంచాయి. ఒక మ్యాచ్‌లో పునేరి పల్టన్ తన ఆధిపత్యాన్ని ప్రదర్శించగా.. మరో మ్యాచ్‌లో హర్యానా స్టీలర్స్ ఊపిరి బిగపట్టి చూసేలా అద్భుత విజయాన్ని అందుకుంది. తొలి మ్యాచ్‌లో పునేరి పల్టన్ జట్టు వరసగా మూడో విజయాన్ని నమోదు చేస్తూ తమ జైత్రయాత్రను కొనసాగించింది. బెంగాల్ వారియర్స్‌తో జరిగిన ఈ పోరులో పల్టన్ 45–36 పాయింట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. జట్టు కెప్టెన్ అస్లాం, ఆదిత్య చెరో 11 పాయింట్లతో రైడింగ్‌లో అద్భుత ప్రతిభ కనబరిచారు. మరోవైపు బెంగాల్ వారియర్స్ కెప్టెన్ దేవాంక్ ఒంటరి పోరాటం చేసి 17 పాయింట్లు సాధించినా, జట్టును గెలిపించలేకపోయాడు. రెండో మ్యాచ్ క్రీడాభిమానులకు అసలైన థ్రిల్లర్‌ను పరిచయం చేసింది. డిఫెండింగ్ చాంపియన్ హర్యానా స్టీలర్స్.. యూ ముంబాతో తలపడిన ఈ మ్యాచ్‌లో చివరి క్షణం వరకు విజయం దోబూచులాడింది. నిర్ణీత సమయం ముగిసేసరికి ఇరుజట్లు 36–36తో సమంగా నిలిచాయి. దీంతో విజేతను తేల్చేందుకు టైబ్రేకర్ అనివార్యమైంది. టైబ్రేకర్‌లో రైడర్ శివమ్ పటారే ఒకే రైడ్‌లో మూడు పాయింట్లు సాధించి హర్యానాను గెలుపు తీరాలకు చేర్చాడు. ఈ ఉత్కంఠభరిత విజయం స్టీలర్స్‌కు ఈ సీజన్‌లో తొలి గెలుపును అందించింది. అజిత్ కుమార్ 12 పాయింట్లతో యూ ముంబా తరఫున పోరాడినా ఫలితం లేకపోయింది. గురువారం జైపూర్ పింక్ పాంథర్స్, తెలుగు టైటాన్స్, పునేరి పల్టన్, దబాంగ్ ఢిల్లీ జట్ల మధ్య మ్యాచ్‌లు జరగనున్నాయి.

మేహాద్రి గేటు ఎత్తివేత



మేహాద్రి గెడ్డ రిజర్వాయర్ నుంచి విడుదలవుతున్న నీరు

పెందుర్తి: మేహాద్రి గెడ్డ రిజర్వాయర్ గేటును అధికారులు బుధవారం ఎత్తారు. రిజర్వాయర్ నీటి మట్టం ఉదయానికి 60.2/61 అడుగులకు చేరుకోవడంతో గేటును తెరిచేందుకు అధికారులు నిర్ణయించుకున్నారు. నీటిపారుదల శాఖ డీఈ జె.స్వామినాయుడు, ఏఈ పి.నళిని తదితరులు ముందుగా పూజలు చేశారు. అనంతరం రిజర్వాయర్ రెండవ గేటును మూడు అంగుళాల మేర ఎత్తి 178 క్యూసెక్కుల నీటిని బయటకు విడుదల చేస్తున్నారు.

చికెన్ ధరలు	
చికెన్ (కిలో) (వెన్‌కాబ్)	
బ్రాయిలర్ (లైవ్)	: రూ.141
స్కిన్	: రూ.252
స్కిన్‌లెస్	: రూ.262

కోడిగుడ్ల ధరలు	రూ.లలో (వందకు)
విశాఖ	575.00
విజయనగరం	579.00
శ్రీకాకుళం	579.00